క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి శిబిరాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో నీతి కథలు చెబుతున్న విద్యార్థిని

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, వ్యాసరచన పోటీలు, నీతి కథలు చెప్పడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గురువారం గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఫణి రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.

ఊరించిన మేఘాలు



మేఘావృతమైన ఆకాశం

మునగపాక : వాతావరణం ఒక్కసారిగా మార్పు రావడంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. అయితే గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం పడుతుందని అంతా ఆశించారు. అయితే చినుకు జాడలేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. రైతులు కూడా వర్షం పడుతుందని ఎదురు చూసినా చివరకు చినుకు పడకపోవడంతో నిరాశకు గురయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



వెంకటాపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తాతాజీ

మునగపాక : అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ కోరారు. మండలంలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీల అభివృద్ధికి ప్రభుత్వం తగు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఎంపీటీసీ వీరునాయుడు, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, మాజీ సర్పంచ్ కనకప్పారావు, పంచాయతీ కార్యదర్శి మోహిని పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన



యోగా గురించి వివరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా యోగా శిక్షకులు నీలిమ చిన్నారులకు యోగాసనాలు వేసే విధానంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

29న కలెక్టరేట్ వద్ద ధర్నా



ఎన్‌ఆర్‌జీఎస్ కూలీలు ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఈ నెల 29న నిర్వహించే ఉపాధి హామీ కూలీల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము పిలుపునిచ్చారు. మండలంలోని కొండకర్ల,పెదపాడు,హరిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో రాము గురువారం మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని కాపాడుకునేందుకు చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి వలంటీర్ సైనికుడిలా పనిచేయాలి



సత్యవరం, మాసాహేబుపేట పంట కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



గ్రామ వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : గ్రామ వలంటీర్లు అంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సైన్యం అని వలంటీర్లపై జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో విశ్వాసం, నమ్మకం, గౌరవం వుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల సత్యవరం గ్రామంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా వుండేందుకు వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందడం కోసమే రాష్ట్రంలో 2 లక్షల 60 వేల మంది వలంటీర్లు, మరో లక్ష 40 వేల మంది సచివాలయ సిబ్బందిని నియమించారన్నారు. ప్రతి వలంటీర్ సైనికుల్లా పని చేసి జగన్‌మోహన్‌రెడ్డిని విజయ పథంలో నడిపించాలన్నారు. అనంతరం పలువురు సేవా మిత్రలకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సాలువాలు కప్పి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్‌లు నకిలేటి రాము, పన్నీరు బాబ్జి, కోడ కోటేశ్వరరావు, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఎంఆర్‌వో కె.జయప్రకాష్, ఎంపీటీసీలు తమ్మిర్సి సత్యనారాయణ, యగదాసు శేఖర్, కలిదిండి సతీష్ రాజు, మాజీ సర్పంచ్ గంగరావు, గూటూరు వెంకటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీను, జగతా శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, రామగోవిందు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సత్యవరం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరు పథకాలు పొందుతున్న లబ్ధిదారులు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పలు ప్రాంతాల్లో డ్రైనేజీసమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామంలో పలువురు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఆన్‌లైన్ ద్వారా యాక్టివేషన్ చేయడం జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి ఉపాధి వేతన దారులు తీసుకొచ్చారు. వెంటనే వేతనదారుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం అధికారులను ఆదేశించారు. సత్యవరం ,మాసాహేబుపేట గ్రామాల్లో పంట పొలాలకు సాగు నీరు సరఫరా జరిగే పంట కాలువ పూడికతీత చేపట్టాలని రైతులు కోరగా, ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

కొరుప్రోలులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం



కొరుప్రోలు అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం : ఫ్యామిలీ డాక్టర్ సేవలను రోగులు సద్వినియోగ పరచుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. కొరుప్రోలు సచివాలయంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజియన్‌లో వైద్య శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలు 67 రకాల మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులకు వైద్య సలహాలు ఇచ్చారు. చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా దుర్గమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం గ్రామంలో దుర్గమ్మతల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ గోవింద్ దర్శించుకుని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు

ధర్మ పరిరక్షణకు తోడ్పడాలి



అప్పన్నపాలెంలో ధర్మ ప్రచార ర్యాలీ

రాంబిల్లి : ధర్మ పరిరక్షణకు అందరూ తోడ్పాటునందించాలని సమరసత ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ కె.అప్పారావు అన్నారు. అప్పన్నపాలెంలో గురువారం ఇంటింటా ధర్మప్రచారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్టిక్కర్లు, కరపత్రాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని అప్పారావు కోరారు. ఈ కార్యక్రమంలో చేశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

దిమిలి సచివాలయంలో ఆధార్ సేవలు



ఆధార్ సేవలందిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ శ్రీను

రాంబిల్లి: దిమిలి సచివాలయంలో ఆధార్ సేవలందుబాటులోకి వచ్చాయి. ఈ సచివాలయంలో గురువారం ఆధార్ సేవలను పలువురు వినియోగించుకున్నారు. ఆధార్ సేవలను డిజిటల్ అసిస్టెంట్ శ్రీను అందజేస్తున్నారు. మహిళా పోలీస్ వెంకటలక్ష్మి ఆధార్ సేవలకు సహకారం అందిస్తున్నారు. దిమిలితో పాటు సమీప సచివాలయాలకు వెళ్లి ఆయా గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఆధార్ సేవలందిస్తామని డిజిటల్ అసిస్టెంట్ శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు డబ్బీరు రాము, కోట భాస్కర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రాట మహోత్సవం



తోడపెద్దు పాలుకొలుపు రాట మహోత్సవం

మునగపాక : వాడ్రాపల్లిలో తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమంలో భాగంగా గురువారం రాట మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 26 రాత్రి అలాగే 27వ తేదీన గ్రామంలో తోడపెద్దు పాలుకొలువు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 12 సేవగరిడీలు పాలుకొలువులో పాల్గొననున్నాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే 27వ తేదీన గ్రామంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మునగపాక : మునగపాక రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వీఏఏ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 10 కిలోలు రూ.395, జనుములు 10 కిలోలు రూ.420, పిల్లి పెసర 8 కిలోలు రూ.388లకు అందజేస్తామన్నారు. ప్రభుత్వ రాయితీ పోగా సంబంధిత విత్తనాలను రైతులకు అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కొత్తమ్మతల్లి జాతర

ఎస్.రాయవరం : వెంకటాపురం గ్రామంలో కొత్తమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించడంతో పాటు రైతులు తమ పొలాల్లో పండిన కొబ్బరి, చెరకు, మామిడి వంటి ఫలాలను నైవేద్యంగా సమర్పించారు. మరికొందరు ఆచార సంప్రదాయాలతో అమ్మవారి చీర సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు కిక్కిరిసారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి భారీ మందుగుండు సామాగ్రి వెలిగించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వేసవి శిబిరంలో రామాయణం



దిమిలి గ్రంథాలయంలో విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరంలో రీసోర్స్ పర్సన్ కె.వాసవి రామాయణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్లుప్తంగా రామాయణం మహాగాథను క్లుప్తంగా వివరించారు. క్రమశిక్షణ, సమాజంలో ఎలా వుండాలో మహిళా పోలీస్ వెంకటలక్ష్మి వివరించారు. రీసోర్స్‌పర్సన్ జి. నూకినాయుడు నీతి కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.శకుంతల పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారం రుచి చూస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : పౌష్టికాహార పంపిణీ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. రామచంద్రపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాకు పరిశీలించి పౌష్టికాహార పంపిణీపై అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశ్నించారు. లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అనంతరం పిల్లలకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ

పరవాడ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మీశ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్ట ఎరువులను అందించారు. అనంతరం వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం జనుము 12 క్వింటాళ్లు, జీలుగ 17 క్వింటాళ్లు, పిల్లి పెసర 3 క్వింటాళ్లు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం సరఫరా చేసిన కొత్తరకం వేరు శనగ విత్తనాలను రైతులకు అందజేసినట్టు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు సంబంధిత అధికారులను సూచించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకుని, భూసారాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఏఎంసీ డైరెక్టర్ దలాయి రాము, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు కె.సీతారామయ్య, కావలి అప్పలరాజు, రొంగలి గంగరాజు, ఎస్.సన్యాసినాయుడు, ఎస్.అప్పలనాయుడు, వ్యవసాయ సహాయ విస్తరణాధికారి ఎం.ఎస్.మూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మారువారం పండగ

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని జోడుగుళ్ల వద్ద కొలువుదీరిన గ్రామ దేవతలు బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల మారువారం పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు బారులుతీరి అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక సిఐ పైడి రంగనాథం అమ్మవార్లను దర్శించుకుని మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, జోడుగుళ్ల యువత పాల్గొని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే కన్నబాబురాజు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : వలటీర్లు సంక్షేమ వారధులని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. వంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గురువారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో పట్టణం, మండలంలోని గ్రామ,వార్డు సచివాలయాలకు సంబంధించిన 248 మంది వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర, సేవావజ్ర పొందిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. సేవావజ్ర పొందిన వారికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జీ, మెడల్ వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదల దరికి చేర్చడంలో వారి పాత్ర అమోఘమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం సేవలందించే వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడంలో ముందుండి ప్రభుత్వానికి వెన్నెముకలా వలంటీర్లు నిలుస్తున్నారని అన్నారు. ఎంపీపీ బోదెపు గోవింద్ మాట్లాడుతూ వలంటీర్లు అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపుగుప్తా, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు యర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, కౌన్సిలర్‌లు దూది నర్సింహమూర్తి, గొర్లె వెంకట్, ఇన్‌చార్జి కమిషనర్ డి.ప్రభాకరరావు, డిఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ జగనన్నే రావాలి



వెంకయ్యపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

రాంబిల్లి : జననేత జగనన్న పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. జడ్. చింతువా సచివాలయం పరిధిలో గల వెంకయ్యపాలెం, గజిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరింది వివరించారు. పథకాలకు ఎటువంటి లాబీయింగ్ , అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకు క్యాలెండర్ విడుదల చేసి ఆ ప్రకారం పథకాలకు సంబంధించిన సొమ్మును జగనన్న బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నారన్నారు. స్థానికంగా మురుగుకాలువల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పలువురు ఇళ్లు మంజూరు చేయాలని కోరగా, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు గెలిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి), ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ పి.భాగ్యవతి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండండి



శాంతికమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ మన్మథరావు

మునగపాక: అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ మన్మథరావు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో గురువారం గ్రామ శాంతి కమిటీ(విలేజ్ పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మన్మదరావు మాట్లాడుతూ పేకాట, జూదం ఆడినట్లయితే చర్యలు తప్పవన్నారు. అలాగే చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. వివాదాలకు తావులేకుండా చిన్న చిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. మహిళా పోలీసు భీమిశెట్టి సరోజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు జామిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం



చూచుకొండలో సత్కారం పొందుతున్న వలంటీర్లు

మునగపాక : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు సేవలందిస్తున్నారని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మండలంలోని చూచుకొండ,గణపర్తి గ్రామాల్లోని వలంటీర్లకు గురువారం ప్రజాప్రతినిధులు,అధికారులు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ తమకు కేటాయించిన 50 గృహాలకు సకాలంలో వలంటీర్లు సేవలందించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మండలంలో ఓ మోస్తరు వర్షం



మండల కేంద్రంలో గాలివాన దృశ్యం

ఎస్.రాయవరం:మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతకు ఉక్కిరి బిక్కిరైన మండల వాసులు వర్షంతో ఉపశమనం పొందారు. గాలివానతో అహ్లాదకర వాతావరణం నెలకొంది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో మండలంలో నలుమూలల తడిచి ముద్దయ్యింది. అయితే మామిడి తోట రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగించిందని రైతులు వాపోయారు. మరికొన్ని రోజుల్లో చేతి కందొచ్చే సమయంలో మామిడి కాయలు నేలరాలాయని చెబుతున్నారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండతో జనం అల్లాడిపోయారు. ఆ తర్వాత వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.


ఉపాధ్యాయుల్లో బదిలీల కోలాహలం



బదిలీల కోసం దరఖాస్తు చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి : విద్యాశాఖ ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల హడావుడి ఊపందుకుంది. బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులకు మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ప్రగడ శివాజీల ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీ పాఠశాలలో ఉచితంగా పలు సేవలందిస్తున్నారు. దీనిలో భాగంగా రేపటితో దరఖాస్తు గడువు ముగుస్తోంది. గురువారం 70 మంది ఉపాధ్యాయులకు దరఖాస్తు చేసే కార్యక్రమం చేపట్టారు. బదిలీలపై ఉపాధ్యాయులలో నెలకొన్న సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మండల పీఆర్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ సేవలతో పాటు మండలంలో అపరిష్కృతంగా ఉన్న ఏపీజీఎల్ఐ, పీఎఫ్ వంటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టి వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఈ వేసవి సెలవుల్లోనే వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి.సన్యాసిరావు, ఎస్.రమేష్, టి.గోపీ, రవిప్రసాద్, బాషా పాల్గొన్నారు.

చిరు జల్లులతో ఉపశమనం



ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో తేలికపాటి వర్షం

అనకాపల్లిటౌన్/కశింకోట : పట్టణ వాసులు గురువారం మధ్యాహ్నం వరకు 38.8 డిగ్రీల ఉష్ణోగ్రతతో అల్లాడిపోయారు. ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశానికి మబ్బులుపట్టి, ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అప్పుడప్పుడు కురిసిన జల్లులు చల్లదనాన్నిచ్చాయి. మబ్బుల వాతావరణం మాత్రం అలానే కొనసాగింది. రాత్రి 7.30 గంటల సమయంలో భారీ ఈదురుగాలులతో మరోసారి వర్షం పడింది. వర్షానికి ముందు వీచిన గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎటూ చూసినా అంధకారం. ఆపై ఆకాశం మెరుపులు, ఉరుములతో వర్షం. దీంతో పనులు ముగించుకుని తమ నివాసాలకు చేరాలనుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కశింకోట ప్రాంతంలో గురువారం రాత్రి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వేసవి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. మధ్యాహ్నం ఆకాశంలో కారు మేఘాలు కమ్ముకుని, ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రాత్రి కాసేపు తేలికపాటి వర్షం కురిసింది. వాతావరణం కాస్త చల్లబరిచింది.